ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



వికారాబాద్ - మేడ్చల్

జిల్లాల వార్తలు

5

ఆదివారం 3 మార్చి 2024

146 మంది విద్యార్థుల గైర్హాజరు

వికారాబాద్, మార్చి2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఇంటర్ సెకెండియర్ ఇంగ్లీష్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. శనివారం జరిగిన పరీక్షకు జిల్లాలో 7,827 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, వారిలో 7,681 మంది హాజరుకాగా, 146 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 108, ఒకేషనల్ విద్యార్థులు 38మంది గైర్హాజరయ్యారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు. 17కేంద్రాలను తనిఖీ బృందాలు తనిఖీ చేశాయి.

పొలంలో అంగన్‌వాడీ కోడిగుడ్లు

ధారూరు మండల పరిధి నాగారం గ్రామ సమీప వ్యవసాయ పొలంలో శనివారం అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే కోడిగుడ్లు పారబోశారు. గ్రామంలోని జీలగడ్డ ప్రాంతంలో వడ్ల శంకరయ్య వ్యవసాయ పొలంలో దాదాపు 500 నుంచి 600 వరకు కోడిగుడ్లను గుర్తుతెలియని వ్యక్తులు పారబోశారు. ఈ కోడిగుడ్లపై తెలంగాణ ప్రభుత్వ అంగన్‌వాడీ గుడ్లు అనే ముద్ర ఉంది. వీటిని ఎక్కడ నుంచైనా తీసుకొచ్చారా.. లేదా సమీప ప్రాంతాల తెచ్చి ఎవరు పారబోశారనేది తెలియటం లేదు. కాగా వీటిని కిరాణ దుకాణాల్లో అమ్మటానికి తీసుకురాగా, వాటిపై అంగన్‌వాడీ గుడ్లు అనే ముద్ర ఉండటంతో విక్రయించేందుకు వీలుకాక పారబోసి ఉండవచ్చని స్థానికులు అనుమానిస్తున్నారు. సంబంధిత అధికారులు విచారణ జరిపితే వాస్తవాలు బయటకొచ్చే అవకాశం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు.

- ధారూరు, మార్చి 2





నాగారంలోని పొలంలో పారబోసిన కోడి గుడ్లు, కోడిగుడ్లపై ఉన్న ప్రభుత్వ ముద్ర

చలో గోవా...

మేడ్చల్ మున్సిపాలిటీకి చెందిన పలువురు కౌన్సిలర్లు శనివారం గోవా టూర్‌కు బయలుదేరారు. ఆయా మున్సిపాలిటీల్లో కొనసాగుతున్న అవిశ్వాసాలకు అడ్డుకట్ట వేసేందుకు మున్సిపల్ చైర్మన్లు ఈ టూర్లకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో మేడ్చల్ మున్సిపల్ కౌన్సిలర్లు గోవా టూర్‌కు బయలుదేరడం చర్చనీయాంశంగా మారింది. నెలరోజుల క్రితం స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి దుబాయ్ టూరుకు వెళ్లిన కౌన్సిలర్లు తిరిగి మరో యాత్రకు బయలు దేరడంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. చైర్‌పర్సన్ భర్త మర్రి నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మొత్తం 12మంది యాత్రకు బయలు దేరగా వీరిలో కొందరు కౌన్సిలర్లు ఉండగా మరి కొందరు కౌన్సిలర్ల భర్తలున్నారు.

మేడ్చల్ టౌన్, మార్చి 2



గోవా టూర్‌కు బయలు దేరుతున్న మేడ్చల్ కౌన్సిలర్లు

చేవెళ్ల నుంచి కొండా..

మల్కాజ్‌గిరి నుంచి ఈటల

- బీజేపీ తొలి జాబితా విడుదల
- కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్‌కు ఎంపీ టికెట్ల ఖరారు





(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్): లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. తెలంగాణలో రాజకీయాలు హీటెక్కుతున్నాయి. ఈక్రమంలోనే భారతీయ జనతాపార్టీ (బీజేపీ) లోక్‌సభ అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేసింది. ఢిల్లీలోని కేంద్ర కార్యాలయంలో ఆపార్టీ జనరల్ సెక్రటరీ వినోద్ తావడే ఏకంగా 195 మంది అభ్యర్థులతో తొలి జాబితాను ప్రకటించారు. అందులో తెలంగాణ నుంచి 9 మంది ఉన్నారు. ముందు నుంచి ప్రచారం జరుగుతున్నట్టుగానే ఈటల రాజేందర్‌కు మల్కాజిగిరి పార్లమెంటు బరిలో నిలిచేందుకు పార్టీ అధిష్ఠానం అవకాశం కల్పించింది. మల్కాజిగిరి నుంచి పార్టీ సీనియర్‌నేత మురళీధరరావు, మల్కకొమరయ్య ఎంపీ టికెట్ కోసం తీవ్రంగా పోటీపడ్డారు. చివరకు ఈటల రాజేందర్‌కు టికెట్ దక్కింది. చేవెళ్ల నుంచి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి అవకాశం దక్కింది. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం 2009లో ఏర్పడింది. ఈ పార్లమెంట్ పరిధిలో తాండూరు, వికారాబాద్, పరిగి, చేవెళ్ల, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. తొలి ఎన్నికలో దివంగత నేత సూదిని జైపాల్‌రెడ్డి ఇక్కడి నుంచి విజయం సాధించారు. ఆయన కేంద్ర మంత్రిగా పనిచేశారు. రెండో సారి ఆయన పోటీకి ఆసక్తి చూపలేదు. 2013లో కేసీఆర్ ఆహ్వానం మేరకు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. 2014లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో విశ్వేశ్వర్‌రెడ్డి విజయం సాధించారు. ఆతర్వాత 2019లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసినా ఓడిపోయారు. 2022లో ఆయన బీజేపీలో చేరారు. కమలం పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న కొండాకు టికెట్ దక్కింది. జాతీయ సాహిత్యపరిషత్ సంఘటన్ కార్యదర్శి భాస్కరయోగి చేవెళ్ల ఎంపీ టికెట్ ఆశించగా చివరకు 'కొండా'ను వరించింది.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రఘునాథస్వామి


నేడే పల్స్ పోలియో

- సర్వం సిద్ధం చేసిన వైద్య ఆరోగ్య శాఖ అధికారులు

వికారాబాద్/మేడ్చల్, మార్చి2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : జాతీయ పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు వికారాబాద్ , మేడ్చల్ జిల్లాల వైద్య ఆరోగ్య శాఖలు అవసరమైన ఏర్పాట్లు చేసింది. వికారాబాద్ జిల్లాలో ఐదేళ్ల లోపు చిన్నారులు 89,903 మంది ఉన్నట్లు గుర్తించిన యంత్రాంగం వీరికి పోలియో చుక్కలు వేసేందుకు 566 కేంద్రాలు ఏర్పాటు చేసింది. మేడ్చల్ జిల్లాలో 1093 బూత్‌ల ద్వారా 4,87,523 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నారు. జిల్లాలో 39 మొబైల్ టీంలు ఏర్పాటు చేశారు. నేడు ఉప్పల్‌లో ఉదయం 7 గంటలకు ఎమ్మెల్యే చేతులమీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు మేడ్చల్ డీఎంహెచ్‌వో రఘునాథస్వామి తెలిపారు. మిగిలిన చిన్నారులకు 4, 5వ తేదీల్లో ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు వేయనున్నారు.



కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) గడువును పలు మార్లు పొడిగించినా వానాకాలం(ఖరీఫ్) బియ్యం సేకరణ పూర్తి కాలేదు. నిర్ణీత గడువులోగా పౌర సరఫరాల సంస్థకు మిల్లర్లు సీఎంఆర్ బియ్యాన్ని అప్పగించాల్సి ఉండగా నిర్లక్ష్యంగా వ్యవహరించడం గమనార్హం. సీఎంఆర్ ఇచ్చే విషయంలో అలసత్వం తగదని, నిర్ణీత గడువులోగా అప్పగించకపోతే చర్యలు తప్పవన్న ఉన్నతాధికారుల హెచ్చరికలను కొందరు మిల్లర్లు బేఖాతరు చేస్తున్నారు.



సీఎంఆర్‌పై మిల్లర్ల నిర్లక్ష్యం!

- సీఎంఆర్ లక్ష్యంలో వచ్చింది 78 శాతమే
- కొరవడిన చర్యలు...
- యాసంగి ధాన్యానికి ఇప్పటి వరకు సేకరించింది 11 శాతం బియ్యమే
- సీఎంఆర్ గడువు పొడిగింపుపై స్పష్టత కరువు

వికారాబాద్, మార్చి2 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : 2022-23 యాసంగి సీజన్‌లో అప్పగించిన ధాన్యానికి సంబంధించిన బియ్యం ఇచ్చేందుకు పొడిగించిన గడువు గత నెల 29వ తేదీతో ముగిసింది. వాస్తవానికి గత జనవరి 31వ తేదీతో గడువు ముగియాల్సి ఉన్నా.. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 29వ తేదీ వరకు గడువు పొడిగించింది. సీఎంఆర్ అప్పగించే విషయంలో మరోసారి గడువు పొడిగించేది లేదని కేంద్రం స్పష్టం చేసిన విషయం తెలిసిందే. కేటాయించిన ధాన్యానికి సంబంధించిన సీఎంఆర్ అప్పగించాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నా కొందరు మిల్లర్లు బేఖాతరు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గడువులోగా సీఎంఆర్ అప్పగించని మిల్లర్లపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధమవుతోంది. అవసరమైతే జరిమానా విధించడంతో పాటు ఆర్ఆర్ యాక్ట్ ప్రకారం మిల్లర్ల ఆస్తులు జప్తు చేయాలని ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. కేటాయించిన ధాన్యానికి అనుగుణంగా ఇవ్వాల్సిన సీఎంఆర్ ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రైస్ మిల్లర్లపై కఠినంగా వ్యవహరించాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా సీఎంఆర్ ఇవ్వాలని సూచిస్తూ పలుమార్లు మిల్లర్లు, సంబంధిత అధికారులతో సమీక్షలు నిర్వహించినా ఆశించిన లక్ష్యం నెరవేరలేదు. సీఎంఆర్ ఇచ్చే విషయంలో నిర్లక్ష్యం తగదని, నిర్ణీత గడువులోగా అప్పగించకపోతే చర్యలు తప్పవన్న ఉన్నతాధికారుల హెచ్చరికలను కొందరు మిల్లర్లు పట్టించుకోకపోవడం గమనార్హం. ధాన్యాన్ని పక్కదారి పట్టించి అందినంత సొమ్ము చేసుకుంటున్న మిల్లులపై నిఘా ఉంచిన ప్రభుత్వం... ధాన్యం ఉన్నా ఇవ్వని మిల్లర్లతో పాటు ధాన్యాన్ని పక్కదారి పట్టించి సీఎంఆర్ ఇవ్వని మిల్లర్లపై పౌర సరఫరాల సంస్థ చర్యలకు సిద్ధమవుతోంది.

వానాకాలం లక్ష్యంలో 78 శాతమే ....

గత ఏడాది (2022-23) వానాకాలం, యాసంగి సీజన్లలో అన్ని మిల్లుల నుంచి పకడ్బందీగా బియ్యం సేకరణ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. గత ఖరీఫ్ (వానాకాలం) సీజన్‌లో జిల్లాలో రైస్ మిల్లులకు 64 మిల్లులకు 95095.560 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా, సీఎంఆర్ రూపంలో 63714.025 మెట్రిక్ టన్నుల బియ్యం అప్పగించాల్సి ఉండగా, గతనెలాఖరు వరకు 49840.347 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం మాత్రమే మిల్లర్లు ఇచ్చారు. ఇంకా 13699.958 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం పౌరసరఫరాల సంస్థకు బకాయి పడ్డారు. సీఎంఆర్ అప్పగించే లక్ష్యంలో మిల్లర్లు ఇప్పటివరకు 78 శాతం మాత్రమే ఇచ్చారు. అదే యాసంగి సీజన్‌లో 85225.600 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైస్ మిల్లులకు కేటాయించగా, సీఎంఆర్ రూపంలో రైస్ మిల్లర్లు పౌర సరఫరాల సంస్థకు 57953.408 మెట్రిక్ టన్నుల బియ్యం అప్పగించాల్సి ఉంది. కాగా, గత నెలాఖరు వరకు 6655.050 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే అప్పగించారు. నిర్ణీత లక్ష్యంలో ఇంత వరకూ 11 శాతం మాత్రమే సీఎంఆర్ ఇచ్చారు. రైస్ మిల్లర్లు సీఎంఆర్ రూపంలో ఇంకా 51298.358 మెట్రిక్ టన్నుల బియ్యం అప్పగించాల్సి ఉంది.

సీజన్ 2022-23	మిల్లులకు ధాన్యం కేటాయింపు	మిల్లర్లు ఇవ్వాల్సిన సీఎంఆర్	ఇంత వరకు ఇచ్చింది	ఇవ్వాల్సిన సీఎంఆర్ (మెట్రిక్ టన్నులు)	ఇచ్చిన సీఎంఆర్ శాతం
వానాకాలం	95095.560	63714.025	49840.347	13699.958	78
యాసంగి	85225.600	57953.411	6655.050	51298.358	11

పక్కదారి పట్టిస్తూ అక్రమార్జన

జిల్లాలో గత కొన్ని సీజన్లుగా సీఎఆర్ సక్రమంగా అప్పగించకుండా ధాన్యం, సీఎంఆర్ బియ్యాన్ని మిల్లర్లు పక్కదారి పట్టిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వం కేటాయించే ధాన్యాన్ని మిల్లింగ్ చేసి నిర్దేశించిన గడువులోగా మిల్లర్లు చెల్లించాల్సి ఉండగా, మిల్లర్లు కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఆలస్యంగా సీఎంఆర్ ఇచ్చే మిల్లులపై గతంలో చర్యలు ఉండేవి. కానీ గత కొంత కాలంగా సీఎంఆర్ ఆలస్యంగా ఇచ్చే మిల్లర్లపై ప్రభుత్వ పరంగా ఎలాంటి చర్యలు లేకపోవడంతో మిల్లర్లు కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇంతవరకు ప్రతి సీజన్‌లో ఎక్కువ మొత్తంలో ధాన్యం రైతుల నుంచి పౌరసరఫరాల శాఖ అధికారులు సేకరిస్తూ రాగా, గత రెండు, మూడు సీజన్ల నుంచి రైతుల నుంచి మిల్లర్లు నేరుగా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న విషయం తెలిసిందే. మిల్లులకు కేటాయించిన ధాన్యానికి సంబంధించిన సీఎంఆర్‌ను మిల్లర్లు తిరిగి అప్పగించకపోవడాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది.

మిల్లర్లపై ఉక్కుపాదం!

రేషన్ బియ్యంతో రీసైక్లింగ్ దందాకు అలవాటు పడిన మిల్లర్లపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. పలుమార్లు గడువు పొడిగించినా సీఎంఆర్ తిరిగి ఇవ్వని మిల్లర్ల పట్ల కఠినంగా వ్యవహరించాలని భావిస్తోంది. సీఎంఆర్ సేకరణలో జరుగుతున్న జాప్యాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం మిల్లర్ల వద్ద ఉన్న ధాన్యాన్ని వేలం ద్వారా విక్రయించేందుకు రంగం సిద్ధం చేసింది. జిల్లాలో 53 మిల్లుల్లో మిల్లింగ్ చేయని 45976.82 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని బహిరంగ వేలం ద్వారా విక్రయించాల పౌర సరఫరాల సంస్థ నిర్ణయించిన విషయం తెలిసిందే. వేలంలో ధాన్యం కొనుగోలు చేసిన వారు డబ్బులు చెల్లించి ధాన్యం తీసుకు వెళ్లాల్సి ఉంటుంది. ఒకటి, రెండు రోజుల్లో సీఎంఆర్ సేకరణ, ధాన్యం వేలం అంశాల్లో స్పష్టత రానున్నట్లు తెలిసింది.

ఈ సారైనా ఇక్కట్లు తప్పేనా?

- కీసరగుట్ట బ్రహ్మోత్సవాల్లో సామాన్య భక్తులకు ఉచిత దర్శనం సాఫీగా జరిగేనా!
- ప్రొటోకాల్ పాటించని అధికారులు
- పోలీస్, రెవెన్యూ అధికారులదే బ్రహ్మోత్సవాల్లో హవా
- సామాన్య భక్తుల గోడు పట్టని వైనం...

కీసర, మార్చి 2: ప్రతి సంవత్సరం కీసరగుట్టపై జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో సామాన్య భక్తులకు ఇక్కట్లు తప్పట్లేదు. అధికారులు ప్రొటోకాల్ పాటించకపోవడంతో వీఐపీ క్యూలైన్ కిక్కిరిసిపోతుంది. దీంతో ఉచిత దర్శనం క్యూలైన్లో ఉండే భక్తులకు బ్రహ్మోత్సవాల్లో దేవుడి దర్శనమేమో కానీ.. క్యూలైన్‌లోనే భక్తులకు అధికారులు దేవుడిని చూపిస్తున్నారు. ఆరురోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలకు లక్షల మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. వసతుల్లో భాగంగా స్వామివారి దర్శనం కోసం అధికారులు ఐదారు క్యూలైన్లు ఏర్పాటు చేస్తారు. వీటిలో మూడు ధర్మదర్శనం (సామాన్య భక్తులకు), రెండు లైన్లు టికెట్ల ద్వారా శీఘ్ర దర్శనం, వీఐపీ పాసుల ద్వారా దర్శనానికి మరో లైన్‌ను ఏర్పాటు చేస్తారు. మొదటి ఐదు లైన్లతో ఎలాంటి సమస్య ఉత్పన్నం కాకున్నా వీఐపీ క్యూలైన్‌తో మాత్రం సామాన్య భక్తులు చుక్కలు చూడాల్సిందే. కీసరగుట్టపై మహాశివరాత్రి రోజు మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, న్యాయమూర్తులు, ఇతర రంగాలకు చెందిన ప్రముఖులు విచ్చేస్తుంటారు. వీఐపీ క్యూలైన్‌లో వచ్చిన వారు దర్శనం చేసుకునేందుకు ఒక్కొక్కరికి సుమారు 10 నుంచి 20 నిమిషాలు వరకు సమయం పడుతుంది. దీంతో సామాన్య భక్తులు పడరాని పాట్లు పడుతున్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని వీఐపీ పాసులు జారీ చేస్తారు. అయితే అధికారులు ఇష్టానుసారంగా వారి బంధువులు, తెలిసిన వారికి దర్శనం పాసులతో పాటు, వాహనాల పాసులు అందజేస్తుంటారు. అసలు పాసులు ఎన్ని ముద్రించారు.. ఎంత మందికి పంపిణీ చేశారనే అనే లెక్కలు జిల్లా అధికారులు ఎవ్వరికీ చెప్పరు. దీంతో వందల కొద్ది వాహనాలు క్షేత్రంపైకి రావడంతో అక్కడ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. సామన్య భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు.

వీఐపీల దర్శనంతో గంటలు తరబడి క్యూలో...

మహాశివరాత్రి రోజు వీఐపీల రాకతో ఉచిత దర్శనం కోసం వచ్చే భక్తులు గంటల తరబడి వేచిఉండాల్సిందే. అదే విధంగా ఉపావాస దీక్షతో పాటు తీవ్ర ఉక్కపోతతో గంటల తరబడి వృద్ధులు, మహిళలు,



కీసరగుట్టలో మహాశివరాత్రి సందర్భంగా క్యూలో భక్తులు(ఫైల్)

చిన్నారులు నానా తంటాలు పడుతుంటారు. గంటల తరబడి లైన్‌లో ఉన్న భక్తులు తీవ్ర అస్వస్థతకు గురైన సందర్భాలు లేకపోలేదు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల సందర్భంగా నిర్వహించిన సమీక్షల్లో కలెక్టర్‌తోసహా, ఇతర శాఖలకు చెందిన అధికారులందరూ జాతరలో సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తాం, ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పిస్తాం అనే మాటలు కేవలం చెప్పడానికే తప్పా, వాస్తవంగా కార్యరూపం దాల్చడం లేదు. అసలు ఉన్నతాధికారులు గదులకే తప్పా, క్షేత్రస్థాయిలో ధర్మదర్శనం లైన్ల వద్ద నిలబడి ఎప్పుడైన భక్తుల సమస్యలు పర్యవేక్షించారా ?అని భక్తులు వాపోతున్నారు. ఎప్పుడైనా ఉచిత దర్శనం లైన్‌లో నిల్చుంటే మా సమస్యలు తెలిసేవని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు సమన్వయంతో సామాన్య భక్తులు ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

బ్రహ్మోత్సవాల్లో పోలీస్, రెవెన్యూ అధికారులదే హవా

కీసరగుట్టపై జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలల్లో పోలీస్, రెవెన్యూ శాఖ అధికారులదే ఫుల్ హవా నడుస్తుంది. ఎందుకంటే వారి శాఖకు సంబంధించిన వారు, బంధువులు ఎవ్వరు వచ్చినా స్వామి దర్శనంతో పాటు, వారి వాహనాలుగుట్టపై వరకు వెళ్తాయి. వారికి ఎలాంటి కారు, దర్శనం పాసులు లేకున్నా పనులన్నీ చకచకా జరిగిపోతాయి. ప్రొటోకాల్ లైన్‌లో పంపించి సామాన్య భక్తులకు ఇక్కట్లు తెపిస్తుంటారు. ఈ తంతు కేవలం మహాశివరాత్రికే కాదు. శ్రావణమాసం, కార్తీక మాసం, తదితర పర్వదినాల సమయాల్లో సామాన్య భక్తులకు అంతరాయం కల్పించడంలో ముఖ్య కారణం పోలీసులేనని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారు సరిగ్గా విధులు నిర్వహిస్తే దర్శనం సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలగవని వారు పేర్కొంటున్నారు. స్వామివారి ముందు అందరూ సమానమే.. కానీ పోలీసులు, రెవెన్యూ, ఇతర శాలకు చెందిన వారికి మాత్రం ప్రత్యేకం, ఎందుకంటే అందరూ క్యూలైన్ ద్వారా స్వామివారి దర్శనం కోసం వెళ్తుంటే, వీరు మాత్రం అవశవ్య దిశలో స్వామివారి దర్శనం కోసం వెళ్తున్నారు. దీంతో ఉచిత, శీఘ్ర దర్శనం కోసం భక్తులు గంటల తరబడి వేచిచూడాల్సి వస్తుంది. ఇదేంటి అని అడిగితే మా ఇష్టం అని నిర్లక్ష్యపు సమాధానం వస్తుంది. ఇప్పటికైనాభక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరుతున్నారు.



కీసరగుట్ట బస్సు ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న భీంరెడ్డి

బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక బస్సులు

కీసరగుట్ట మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు సికింద్రాబాద్ డివిజనల్ మేనేజర్ భీంరెడ్డి అన్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శనివారం కీసరగుట్ట బస్సు ప్రాంగణంలో భీంరెడ్డి పలు డిపోల మేనేజర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 6వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఆయన తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం జంట నగరాల నుంచి దాదాపు 200 బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. కుషాయిగూడ, ఉప్పల్, చెంగిచర్ల, కంటోన్మెంట్, రాణిగంజ్ డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. డిప్యూటీ రీజినల్ మేనేజర్ సురేష్ చౌహన్, కుషాయిగూడ డిపో మేనేజర్ చంద్రకాంత్, కవిత, బహుభూతి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

గడువులోపు ధరణి దరఖాస్తులను పరిష్కరించాలి

- మేడ్చల్, వికారాబాద్ జిల్లాల కలెక్టర్లు గౌతమ్, నారాయణరెడ్డి

మేడ్చల్ మార్చి 2(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిర్ణీత గడువులోపు ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించేందుకు ఈనెల 9వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా ధరణి పోర్టల్ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఏవిధంగా పరిష్కరించాలి అనే విషయంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ధరణి పోర్టల్‌లో ఉన్న ప్రతి ఒక్క మాడ్యుల్ గురించి వివరించారు. రిపోర్టులను పరిశీలించి సంబంధిత నివేదికలతో పూర్తి స్థాయిలో కలెక్టరేట్‌కు సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌వో హరిప్రియ, ఆర్డీవోలు పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

వికారాబాద్: ధరణి భూ సమస్యలపై నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. శనివారం ధరణి స్పెషల్‌డ్రైవ్ పై రెవెన్యూ అధికారులతో టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో రైతుల సమస్యల పరిష్కార దిశగా అధికారులకు సహకరించాలని కోరారు. జిల్లాలో స్థానిక సంస్థల శాసనమండలి ఎన్నిక నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్‌కు వచ్చే ఫిర్యాదు దారులు గమనించాలన్నారు. జిల్లాలో ఇప్పటికే మంజూరై వివిధ దశల్లో పెండింగ్ ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలనీ సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు.శనివారం టెలికాన్ఫరెన్సు ద్వారా అధికారులతో మాట్లాడారు. సీసీ రోడ్ల నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టాలని ఆదేశించారు.

నేడు విగ్రహావిష్కరణ యాలాల: అగ్గనూర్‌లో నేడు(ఆదివారం) చత్రపతి శివాజీ విగ్రహావిష్కరించనున్నట్లు అగ్గనూర్ వివేక్ యువజన సంఘం ప్రతినిధులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలు పాల్గొంటారని చెప్పారు.

ఎంఎంటీఎస్ రైలు ప్రారంభ ఏర్పాట్ల పరిశీలన


ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్, మార్చి 2: ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఎంఎంటీఎస్ రైలు ఘట్‌కేసర్‌కు వచ్చే సమయం ఆసన్నమైందని ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 5న ఎంఎంటీస్ రైలును సంగారెడ్డిలో ప్రధాని నరేంద్రమోడీ ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. అదే సమయంలో లింగంపల్లి నుంచి ఘట్‌కేసర్ వరకు నడిచే ఎంఎంటీఎస్ రైలును సైతం వర్చువల్‌గా ప్రారంభిస్తారని గుర్తు చేశారు. మొదట ఎంఎంటీఎస్ సేవలు చర్లపల్లి వరకే ఉండేదని దానిని ఘట్‌కేసర్ వరకు తీసుకు రావడానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఘట్‌కేసర్‌కు చెందిన రాజ్యసభ సభ్యులు(ఎంపీ)డాక్టర్ కోవ లక్ష్మణ్ సాయంతో ఢిల్లీలో రైల్వే మంత్రిని కలిసి ఘట్‌కేసర్ వరకు తీసుకువచ్చినట్లు గుర్తుచేశారు. ఎంఎంటీఎస్ రైలు ఘట్‌కేసర్ వరకు రావడం వల్ల ఇక్కడి ప్రజలకు రవాణ సౌకర్యం మెరుగుపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన కిషన్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమాన్, రామతీర్థ, బస్వరాజు, పవన్‌రెడ్డి, శంకర్, శివరాజ్, దినేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 8 నుంచి గ్రూప్ 1 ఉచిత కోచింగ్

వికారాబాద్, మార్చి 2: ఈనెల 8వ తేదీ నుంచి టీఎస్ పీఎస్ గ్రూప్-1 ఉచిత కోచింగ్ నిర్వహించనున్నట్లు టీఎస్ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత కోచింగ్‌ను టీఎస్ బీసీ స్టడీసర్కిల్, రోడ్‌నెంబర్-8 లక్ష్మీ నగర్ కాలనీ, సైదాబాద్, హైదరాబాదలో చేపడుతున్నట్లు తెలిపారు. అర్హులైన, ఆసక్తి గల అభ్యర్థులు మార్చి 3 నుంచి 7వ తేదీ వరకు నేరుగా పై చిరునామాలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల తల్లిదండ్రులల వార్షిక ఆదాయం రూ.5లక్షల లోపు ఉండాలన్నారు. గ్రాడ్యుయేషన్ పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా, రిజర్వేషన్ ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 040-24071178, 040-27077929 నంబర్లలో సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు.

'స్పెషల్ డ్రైవ్' సక్రమంగా నిర్వహించాలి

ధారూరు, మార్చి 2: ధరణి సమస్యలపై చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌ను సక్రమంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. ధారూరు తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం అయన సందర్శించారు. ఈనెల 9వరకు పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. దరఖాస్తుల పరిశీలన, పరిష్కరంపై అధికారులకు పలు సూచనలు చేశారు. రెండు బృందాలు ఏర్పాటుచేసి పెండింగ్ దరఖాస్తులన్నింటినీ ప్రక్షాళన చేయాలని తహసీల్దార్ సాజిదాబేగం, డీటీ విజయ్‌లకు సూచించారు.



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

నెలరోజుల పాటు 'పోలీస్ యాక్ట్ 161'

● వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి



వికారాబాద్, మార్చి 2 : జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని నెలరోజుల పాటు(మార్చి 31) జిల్లా వ్యాప్తంగా 30, 30(ఏ) పోలీసు యాక్ట్ 161 అమలులో ఉంటుందని ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి తెలిపారు. పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు సభలు, సమావేశాలు నిర్వహించరాదని, శాంతిభద్రతలకు భంగం కలిగేలా, ప్రజాధనానికి నష్టం వాటిల్లేలా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదని ఎస్పీ తెలిపారు. జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఈ విషయంలో పోలీసులకు సహకరించాలని కోరారు. అనుమతి లేకుండా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టవద్దని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

గ్రేట్ 'జాబ్'

● ఒకేసారి 4 ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన నలుగురు

● ఒకే ఇంట్లో అక్కాతమ్ముడికి.. రెండు కొలువులు సాధించిన మరొకరు..



నాలుగు కొలువులు సాధించిన పావని, మహిపాల్(పైన) సయ్యద్ అర్షా, లలితకుమారి(కింద)

వికారాబాద్/కందుకూరు/దౌల్తాబాద్, మార్చి 2 : ఈ రోజుల్లో ఒక్క ప్రభుత్వ ఉద్యోగం సాధించాలంటేనే రోజూ గంటల తరబడి కష్టపడి చదవాలి. అలాంటిది ఏకంగా నాలుగు కొలువులు సాధించడం అంటే.. వారు ఎంతలా శ్రమించారో ఊహించుకోవచ్చు. వివరాల్లోకి వెళితే.. వికారాబాద్ పట్టణంలోని రామయ్య గూడకు చెందిన దుద్యాల పావని ఒకటి కాదు రెండు కాదు ఏకంగా నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. తల్లి చంద్రమ్మ ఓ మెడికల్ కాలేజీలో స్వీపర్‌గా పనిచేస్తూ కష్టపడి చదివించింది. దానికి ఫలితంగా అహర్నిశలు శ్రమించి అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది పావని. గురుకుల బోర్డు నిర్వహించిన పరీక్షతో పాటు ఇంటర్వ్యూ, డెమోలో ప్రతిభ చూపింది. దాంతో ఏకంగా నాలుగు ఉద్యోగాలకు అర్హత సాధించింది. డిగ్రీ లెక్చరర్, జూనియర్ లెక్చరర్, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్, ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్‌గా అర్హత సాధించింది. పావనికి కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందనలు తెలిపారు. నవాబుపేట మండలం పులుమామిడికి చెందిన లక్ష్మీగళ్ల జంగయ్య, అనంతమ్మల మూడో కుమారుడు మహిపాల్ ఇటీవల ప్రకటించిన గురుకుల ఉద్యోగ ఫలితాల్లో నాలుగు ఉద్యోగాలకూ ఎంపికయ్యాడు. పేద కుటుంబంలో జన్మించిన మహిపాల్ పాఠశాల విద్యాభ్యాసాన్ని స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో.. హైదరాబాద్ నిజాం కళాశాలలో గ్రాడ్యుయేషన్, ఉస్మానియా వర్సిటీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. డీఎల్, జేఎల్, పీజీటీ, టీజీటీ ఉద్యోగాలు సాధించాడు. పీజీటీ, జేఎల్ ఫలితాల్లో భాగంగా రాష్ట్రంలో 2వ స్థానంలో, మల్టీజోన్-2లో మొదటి స్థానంలో నిలిచాడు. కాగా, మహిపాల్ 2018లో పంచాయతీ కార్యదర్శి ఉద్యోగం సాధించాడు. తన వెన్నంటి ఉండి మద్దతిచ్చిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, చిన్నప్పటి నుంచి మార్గదర్శనం చేసిన గురువులకు, మిత్రులకు మహిపాల్ ధన్యవాదాలు తెలిపాడు. అదే విధంగా రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం నేదునూరు గ్రామానికి చెందిన సయ్యద్ అర్షా ఒకేసారి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచింది. డీఎల్(గణితం), జేఎల్, పీజీటీతో పాటు టీజీటీ కొలువులు సాధించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్-4 ఫలితాల్లోనూ ఆమె అర్హత సాధించింది. టీఎస్‌పీఎస్సీ(జేఎల్) ఫలితాల్లోను రాణించనున్నట్లు అర్షా 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. కాగా, తన భర్త ఎండీ సల్మాన్(ప్రభుత్వ ఉపాధ్యాయుడు) ప్రోత్సాహంతోనే ఇదంతా సాధ్యం అయినట్లు తెలిపారు. డిగ్రీ లెక్చరర్(డీఎల్) ఉద్యోగాన్ని ఎంచుకొని విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడతానని అర్షా పేర్కొన్నారు. ఈనెల 4న సీఎం చేతుల మీదుగా ఉద్యోగ నియామకపత్రం అందుకోనున్నట్లు ఆమె తెలిపారు. అదేవిధంగా వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం గోకఫస్లాబాద్ గ్రామానికి చెందిన కొండా లలితకుమారి జేఎల్(రసాయన శాస్త్రం), టీజీటీ(భౌతిక శాస్త్రం), టీజీటీ(జీవ శాస్త్రం), టీజీటీ(జనరల్ సైన్స్)లలో ఉద్యోగాలు సాధించింది. ఈ సందర్భంగా లలితకుమారిని గ్రామస్తులు, కుటుంబసభ్యులు అభినందించారు.

ఒకే కుటుంబంలో(అక్కాతమ్ముడు) ఇద్దరికీ..



నేనావత్ పద్మ, రమేశ్

దోమ : మండలంలోని దిర్సంపల్లి తండాకు చెందిన ఒకే కుటుంబంలో అక్కాతమ్ముడు ఇద్దరూ గురుకుల ఫలితాల్లో పీజీటీ, టీజీటీ ఉద్యోగాలు సాధించారు. మొదట నేనావత్ పద్మ పీజీటీ ఉద్యోగం సాధించగా.. తాజాగా వెలువడిన ఫలితాల్లో జూనియర్ లెక్చరర్(గణితం)గా.. సోదరుడు రమేశ్ టీజీటీ ఉద్యోగం సాధించాడు. కుటుంబసభ్యులు, గ్రామస్తులు వారిని అభినందించారు.

ఏకకాలంలో రెండు ఉద్యోగాలకు ఎంపిక



మున్నూరు శివలీల

పెద్దేముల్ : మహిళ గురుకుల పాఠశాలలో లెక్చరర్‌గా పని చేస్తూ ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపిక కావాలనే లక్ష్యంతో చదివి ఏకకాలంలో రెండు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైంది మండలంలోని బండమీదిపల్లికి చెందిన మున్నూరు శివలీల. ఆమె గురుకుల ఫలితాల్లో జేఎల్‌కు ఎంపికైంది. ఇదిలా ఉండగా మళ్లీ ఫిజికల్ సైన్స్ (టీజీటీ) ఉద్యోగానికి కూడా ఎంపికై తన పట్టును నిరూపించుకోవడంతో పలువురు అభినందిస్తున్నారు.

కళతప్పిన పల్లె ప్రకృతివనాలు



నంద్యానాయక్ తండాలోని పల్లె ప్రకృతివనం ఇలా..



ఎండుముఖం పట్టిన మొక్కలు

బషీరాబాద్, మార్చి 2 : గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లె ప్రకృతివనాలు బోసిపోతున్నాయి. సరైన నిర్వహణ లేక కళ తప్పుతున్నాయి. మండల పరిధిలోని చాలా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, జీపీ సిబ్బంది పల్లె ప్రకృతివనాలను పట్టించుకోవడం మానేశారు. నాటిన మొక్కలకు నీరు పట్టడం, పిచ్చి మొక్కల తొలగింపు వంటి చర్యలు చేపట్టడం లేదు. సర్పంచ్‌ల పాలన ముగిసి ప్రత్యేకాధికారులు బాధ్యతలు చేపట్టినా వాటి నిర్వహణపై దృష్టిసారించడం లేదు. దాంతో పలుచోట్ల మొక్కలు వాడి, ఎండుముఖం పడుతూ కళహీనంగా మారాయి. మండలంలోని నంద్యానాయక్‌తండా పల్లె ప్రకృతివనం ఈ దుస్థితికి అద్దం పడుతోంది.

'ఉపాధి' కూలీలకు వేతనం పెంచాలి



కూలీలతో మాట్లాడుతున్న శ్రీనునాయక్

షాద్‌నగర్, మార్చి 2 : పెరిగిన నిత్యావసర ధరలను పరిగణలోకి తీసుకొని ఉపాధి హామీ కూలీల రోజువారి వేతనాలను పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈమేరకు శనివారం ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనునాయక్ ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్ గ్రామంలో కూలీలు పని చేస్తున్న ప్రదేశానికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కూలీలకు రోజూవారి వేతనాన్ని రూ. 800లకు పెంచాలని, లేకుంటే కొలతలైనా తగ్గించాలని డిమాండ్ చేశారు. 5నెలలుగా వర్షాలు లేపోవడంతో కూలీలకు పనులు దొరకడం లేదన్నారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నందున పనిదినాలను 100 నుంచి 200లకు పెంచాలని కోరారు. పని ప్రదేశంలో కూలీలకు తాగునీరు, మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచాలన్నారు. పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో ఐక్య ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.

జీపీ కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలి



సూపరింటెండెంట్ వేణుగోపాల్‌కు వినతి పత్రం ఇస్తున్న నర్సింహారెడ్డి

కొత్తూర్, మార్చి 2: గ్రామంపచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని జీపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని కోరుతూ శనివారం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో కార్మికులు ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ వేణుగోపాల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఎన్నో ప్రభుత్వాలు మారుతున్నా.. జీపీ కార్మికుల బతుకులు మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా కార్మికులకు బీమాతో పాటు గుర్తింపుకార్డులు, కనీస వేతనాలు అందజేయాలన్నారు. ఏఐటీయూసీ నాయకుడు మామిడి శేఖర్‌రెడ్డి, నాయకులు మైసయ్య, రాములు, భిక్షపతి, సురేష్, సాయిలు, యాదగిరి తదితరులున్నారు.

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వృత్తి నైపుణ్య శిక్షణ

షాబాద్, మార్చి 2 : నిరుద్యోగ యువతకు రోటరీక్లబ్ చందానగర్ వారి ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు గోపీకృష్ణ, మాజీ అధ్యక్షుడు చేవెళ్ల స్వామి అన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులు, మహిళలకు వృత్తి నైపుణ్య శిక్షణ తరగతులు ఇవ్వడానికి రోటరీక్లబ్ ముందుకొచ్చిందన్నారు. స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్, అకౌంటింగ్, ఎలక్ట్రీషియన్, టైలరింగ్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు చందన్‌వెళ్లి జీపీ కార్యాలయంలో ఆదివారం పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వివరాలకు 9866378835 ఫోన్ నెంబరును సంప్రదించాలన్నారు. ప్రధాన కార్యదర్శి రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

మంచి పనులతో సమాజంలో గుర్తింపు



ఎంపీడీవోను సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 2 : ప్రభుత్వ ఉద్యోగులు నిబద్ధతతో పని చేసినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన బదిలీపై వెళ్ళిన ఎంపీడీవో వై.అరుణారెడ్డి ఆత్మీయ వీడ్కోలు సమావేశానికి జడ్పీచైర్మన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగులకు బదిలీలు తప్పవన్నారు. అరుణారెడ్డి చేసిన సేవలు మరువలేనివని గుర్తుచేశారు. ఆరేళ్ళ పాటు ఎన్నో మంచి పనులు చేశారని ఎంపీపీ తెలిపారు. కరోనా సమయంలో తనతో పాటు గ్రామాల్లో తిరిగి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు. అనంతరం ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, మండల అధికారులు, కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది అరుణారెడ్డిని ఘనంగా సత్కరించారు. వైఎస్ ఎంపీపీ జంగమ్మ, ఎంపీడీవో గీతారెడ్డి, ఎంపీటీసీలు భాస్కర్‌రెడ్డి, రామారావు, వినోద, రవి, కందుల సరళ, ఎంపీవో నందకిశోర్, మాజీ ఎంపీపీ బండారి శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్‌లు ఓరుగంటి వెంకటేష్‌గౌడ్, కొంతం వెంకట్‌రెడ్డి, వంగూరి శివశంకర్, యాదగిరి, ఆయా గ్రామాల కార్యదర్శులు, అధికారులు, మండల, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతినెలా రూ.16 నొక్కేస్తున్నారు!

● ఆసరా పింఛన్ల పంపిణీలో చేతివాటం ● 2,016 రూపాయలకు చేతికందేది రూ.రెండు వేలే..

● సరిపడా చిల్లర లేదంటూ పోస్టాఫీస్ సిబ్బంది చిర్రుబుర్రు ● చేసేదేమీలేక గమ్మునుంటున్న లబ్ధిదారులు



పంచాయతీ కార్యాలయం వద్ద పింఛన్‌దారులు

మర్పల్లి, మార్చి 2 : ప్రతీ నెల పింఛన్ల పంపిణీలో పోస్టాఫీస్ సిబ్బంది చేతివాటం చూపిస్తున్నారు. సరిపడా చిల్లర లేదంటూ పింఛన్‌దారుల వద్ద రూ.16 నొక్కేస్తున్నారు. ఇదేమిటనీ ప్రశ్నిస్తే.. వారి పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ప్రభుత్వం ప్రతీనెల వృద్ధులకు, వితంతువులకు, దివ్యాంగులకు ఆసరా పింఛన్లు అందిస్తోంది. ఈక్రమంలో ప్రతీ పింఛన్‌దారుకురూ.2,016 అందించాల్సి ఉండగా.. మర్పల్లి మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామ పంచాయతీల్లో పోస్టాఫీస్ సిబ్బంది రూ.2వేలు అందించి పింఛన్ బుక్కుల్లో మాత్రం రూ.2,016 అందించినట్లు నమోదు చేస్తున్నారు. ప్రతీనెల రూ.16 చొప్పున నొక్కేస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని పింఛన్ లబ్ధిదారులు వాపోతున్నారు. ప్రభుత్వం ద్వారా రూ.2,016 వస్తే రూ.16 ఎందుకు ఇవ్వడం లేదని కొందరు ప్రశ్నించగా.. చిల్లర ఎక్కడి నుంచి తీసుకురావాలని దబాయించడమే కాకుండా.. పింఛన్ బుక్కులను విసిరి పడేస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. మరి కొంత మంది రూ.2వేలే అందిస్తామని లబ్ధిదారుల దగ్గరి నుంచి చిల్లర నొక్కేస్తున్నారు. ఇప్పటికైనా పింఛన్‌ల పంపిణీ సమయంలో ప్రభుత్వం ద్వారా వచ్చే మొత్తాన్ని అందించేలా చూడాలని పింఛన్‌దారులు వేడుకుంటున్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక



ఎమ్మెల్యే కసిరెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

ఆమనగల్లు, మార్చి 2 : మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధిపరిచి ఆదర్శంగా నిలుపుతానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించి అమలు చేస్తామన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధిపై శనివారం పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులతో ఎమ్మెల్యే హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సమీక్ష నిర్వహించారు. ఆమనగల్లు మాజీ సర్పంచ్ గుర్రం కరుణశ్రీ కేశవులు ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్యేను కలిసి స్థానిక సమస్యలను వివరించారు. మున్సిపాలిటీ పరిధిలోని చంద్రాయన్‌పల్లి తండా, విఠాయిపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరగా సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్నివార్డుల్లో సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాల్వలు, వీధిదీపాలు ఏర్పాటు చేస్తామని, మున్సిపాలిటీ పరిధిలో మిషన్ భగీరథ అసంపూర్తి పనులు పూర్తిచేయించి వేసవి లో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నాయకులు గుర్రం కేశవులు, రాగ్యానాయక్, శ్రీధర్, హర్యానాయక్, గోపాల్‌నాయక్, తిరుమలేశ్, గోపి, రవి, మల్లేశ్ నాయక్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యంతో నూతన ఆవిష్కరణలు

● గురునానక్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ జీఎస్ కోహ్లీ

ఇబ్రహీంపట్నం, మార్చి 2 : విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో నైపుణ్యం సాధించి నూతన ఆవిష్కరణలు చేయాలని గురునానక్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ అన్నారు. ఇబ్రహీంపట్నంలోని గురునానక్ విద్యా సంస్థల్లో శనివారం బ్రుమోస్ ఫీస్టా టెక్నో, కల్చరల్ ఫెస్ట్ - 2024ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగ సాధనే ధ్యేయంగా కాకుండా పలువురికి ఉద్యోగాలు కల్పిస్తూ పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని అన్నారు. ఈ విషయంలో అధ్యాపకులు కూడా విద్యార్థులకు సహకరించాలని చెప్పారు. గురుశిష్యుల బంధం బలంగా ఉండేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని ఆ సంస్థ ఎండీ హెచ్.ఎస్.సైనీ అన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు హుషారుగా పాల్గొన్నారు. అలాగే వివిధ విభాగాల్లో విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా.కె.వెంకట్రావు, ప్రిన్సిపాల్ డా.ఎస్.శ్రీనాథరెడ్డి, జాయింట్ డైరెక్టర్ డా.పి.పార్థసారధి, అసోసియేట్ డైరెక్టర్ డా.రిషి సాయల్, ఆర్అండ్‌డీ డీన్ డా.ఎస్.వి.రంగనాయకులు, సంజీవ్ శ్రీవాస్తవ, ఈవెంట్ చీఫ్ కోఆర్డినేటర్ డా.హరీష్ కుంద్రా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గగన్‌దీప్ సింగ్ కోహ్లీ

ముగిసిన సింధూర గణపతి శిఖర ప్రతిష్ఠాపన

● జినుగుర్తి ఏకలవ్య గ్రామీణ వికాస్ కేంద్రంలో పూజలు

● పాల్గొన్న అహోబిల రామానుజ జీయర్‌స్వామి

● భక్తిశ్రద్ధలతో గణపతి విగ్రహ ప్రాణప్రతిష్ఠ





పూజలు నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ అఖిల భారత ప్రతినిధి భాగయ్య, ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరైన రామానుజ జీయర్‌స్వామి, తదితరులు

తాండూరు రూరల్, మార్చి 2 : తాండూరు మండలం జినుగుర్తి గ్రామ శివారులోని ఏకలవ్య గ్రామీణ వికాస కేంద్రంలో మూడు రోజులుగా నిర్వహించిన సింధూర గణపతి దేవాలయం పునర్నిర్మాణం, శిఖర ప్రతిష్ఠాపన ఉత్సవాలు శనివారం ముగిశాయి. ఈనెల 29 నుంచి వేదమంత్రాలతో గణపతిపూజ, పుణ్యహావచనం, పాంచగవ్యపూజ, సంప్రోక్షణ, ఆచార్యాది ప్రధాన కళష ఆరాధన, అగ్ని ప్రతిష్ఠాపన, ధ్వజారోహణం, జలాధివాసం, హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి ఆధ్వర్యంలో సింధూర గణపతి ప్రాణప్రతిష్ఠ, పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 11.20 గంటలకు ప్రారంభమైన పూజలు సాయంత్రం వరకు కొనసాగాయి. ఆర్ఎస్ఎస్ అఖిల భారత కార్యనిర్వాహక ప్రతినిధి శ్రీభాగయ్య ఆధ్వర్యంలో ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ చైర్మన్ బార్ల సురేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. తాండూరు మండల బీజేపీ నాయకులు, ఏకలవ్య ఫౌండేషన్ సభ్యులు షేఖాపురం ఆంజనేయులు, సుధారాణి దంపతులు హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఏకలవ్య ఫౌండేషన్ సమష్టి నిర్ణయంతో సింధూర గణపతిగా నామకరణం చేసి విగ్రహ ప్రాణప్రతిష్ఠ నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వినోద్‌కుమార్ జైన్, పి.బాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు నాగప్ప, సుబ్బారావు, మల్లేశం, జయదేవ్, కృష్ణాముదిరాజ్, బాలకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్, ప్రభుశంకర్, రమేష్, వై.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లికార్జునస్వామి కల్యాణం



బెల్కటూర్‌లో మల్లికార్జునస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దంపతులు

తాండూరు రూరల్ : తాండూరు మండలం బెల్కటూర్ శివారులోని మల్లికార్జునస్వామి ఆలయంలో శనివారం భ్రమరాంబిక-స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన ప్రధాన పూజారి రాజయ్య ఆధ్వర్యంలో గాండ్ల సంగప్ప, శివలీల, మఠం సుధీర్, శాంతకుమారి, భ్రమరాంబిక అమ్మవారి తరఫున అల్లిపురం వెంకటేశం, సౌభాగ్యవతి, సంతోష్‌కుమార్, అన్నపూర్ణ దంపతులు కల్యాణం నిర్వహించారు. కల్యాణం అనంతరం శివస్వాములు భక్తులకు అన్నదానం చేశారు. శివస్వాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతీ గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం


పీఆర్ రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పూడూరు, మార్చి 2 : ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పూడూరు మండలం కంకల్ గ్రామం నుంచి లాల్‌పహాడ్ వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులను, పూడూరు గ్రామం పీఆర్ రోడ్డు బ్రిడ్జి పనులను పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి శనివారం మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామాన్ని జిల్లాలోనే ఆదర్శంగా నిలుపుతామన్నారు. ప్రతి మారుమూల గ్రామాలకు బీటీ రోడ్డు ఏర్పాటయ్యేలా కృషి చేస్తానని అన్నారు. గ్రామాలు బాగుపడితేనే దేశం బాగుపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కడుమూర్ ఆనందం, ప్రభాకర్, మండల అధ్యక్షుడు సురేందర్, పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి పెంటయ్య, శ్రీనివాస్, సీనియర్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

వైభవంగా పోలెపల్లి జాతర


ఎల్లమ్మ రథోత్సవానికి తరలివచ్చిన భక్తులు

బొంరాస్‌పేట్, మార్చి 2: తెలంగాణలో మినీ మేడారంగా పిలవబడే దుద్యాల మండలంలోని పోలెపల్లి జాతర ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారి రథోత్సవం కనుల పండగగా కొనసాగింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఎల్లమ్మ దేవతను కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు జయకృష్ణ, రాజేశ్‌రెడ్డి, అంజిల్‌రెడ్డి తదితరులు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ తరఫున వారిని సన్మానించారు. జాతర ఉత్సవాల్లో భాగంగా శనివారం ప్రధాన ఘట్టం రథోత్సవం, అంతకు ముందు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చుక్క బోనంతో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలోని పూణె, షోలాపూర్ తదితర ప్రాంతాలకు చెందిన జాతర ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఎల్లమ్మ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఆదివాసీ రాష్ట్ర అధ్యక్షుడు సుభాష్‌నాయక్


సీఎం రేవంత్‌రెడ్డికి చిత్రపటాన్ని అందజేస్తున్న సుభాష్‌నాయక్

కొడంగల్, మార్చి 2: సీఎం రేవంత్‌రెడ్డిని ఆదివాసీ రాష్ట్ర అధ్యక్షుడు సుభాష్ నాయక్ కలిశారు. హైదరాబాద్‌లో ప్రపంచ పర్వతారోహకుడు బలరాం రాథోడ్‌తో శనివారం హైదరాబాద్ వెళ్లి సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. గతనెల 4న బలరాం రాథోడ్ అధిరోహించిన సౌత్ అమెరికా, అర్జెంటీనాలో దక్షిణ ఖండంలోనే అతి ఎత్తైన మౌంట్ అకాంక్వా గువా పర్వతంపై ఆయన జాతీయ జెండాను ఎగురవేశాడు. సీఎం రేవంత్‌రెడ్డిపై తనకున్న అభిమానంతో సీఎంకు చిత్రపటాన్ని అందించారు.

ఫార్మాసిటీ మాకొద్దు


దుద్యాల చౌరస్తాలో నిరసన తెలుపుతున్న రైతులు

బొంరాస్‌పేట్, మార్చి 2: మండలంలోని లగచర్ల, హకీంపేట్, పోలెపల్లి గ్రామాల పరిధిలో ఫార్మా కంపెనీల ఏర్పాటు కోసం భూములు సర్వే చేసిందని, ఫార్మా కంపెనీలు తమకొద్దంటూ రైతులు నిరసన తెలిపారు. శనివారం దుద్యాల మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి చౌరస్తాలో నిరసన తెలిపారు. ప్రభుత్వ అధికారులు రైతుల ఇబ్బందులను గుర్తించి భూములు తీసుకోరాదన్నారు. గ్రామంలో ర్యాలీగా బయలుదేరి తహసీల్దార్ దానయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ బొమ్మతో ఉన్న బ్యాగుల పంపిణీ

● పోలీసులకు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులు

ధారూరు, మార్చి 2: మహబూబ్‌నగర్ స్థానికల సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ప్రధాని మోదీ, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కమలం పువ్వు బొమ్మలు ముద్రించి ఉన్న బ్యాగులను శనివారం ధారూరులో ప్రజలకు పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి వీటిని పంచుతున్నారని కాంగ్రెస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బ్యాగులను సీజ్ చేసి విచారణ చేపట్టి పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే పర్యావరణ పరిరక్షణ కోసమని శనివారం ధారూరులో బ్యాగులను పంపిణీ చేశారు. ఈ బ్యాగులపై ప్రధాని నరేంద్రమోదీ, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కమలం పువ్వు గుర్తులు ముద్రించి ఉన్నాయి. మహబూబ్‌నగర్ స్థానికల సంస్థల ఎన్నికల కోడ్‌ను ఉల్లఘించి ప్రచారం కోసం బీజేపీ నాయకులు బ్యాగులను పంపిణీ చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సిబ్బందితో అక్కడికి వెళ్లి పంపిణీ చేస్తున్న బ్యాగులను స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై ఎస్‌ఐని వివరణ కోరగా ఈ ఘటనకు సంబంధించి బాధ్యులపై కేసు నమోదు చేస్తున్నామని తెలిపారు.

'ధరణి' సమస్యల పరిష్కారానికి చర్యలు

కొడంగల్, మార్చి 2: పెండింగ్‌లో ఉన్న ధరణి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ బి.విజయ్ కుమార్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొడంగల్ మండల వ్యాప్తంగా 519 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇందుకు ఈనెల 9వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సిబ్బంది క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

అవినీతి, అక్రమాలపై విచారణ జరపాలి

ఘట్‌కేసర్, మార్చి 2: మున్సిపాలిటీలోని 10వ వార్డులో గల నర్సరీ ప్రైవేట్‌వ్యక్తులకు అప్పగించి అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిపై విచారణ జరపాలని కౌన్సిలర్ కొమ్మగోని రమాదేవి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని, ఆమె భర్త జంగయ్య యాదవ్, కమిషనర్ ఎండీ సాబేర్‌అలీలు సర్వేనెంబర్ 127లోని 1.39ఎకరాల్లో ఉన్న నర్సరీ విషయంలో రహస్య ఒప్పందం చేసుకోవడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఈవిషయమై పూర్తి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

బీజేపీ జిల్లా కార్యదర్శికి నియామక పత్రం అందజేత

దోమ, మార్చి 2: అయినాపూర్ గ్రామానికి చెందిన మేకల యాదయ్యకు బీజేపీ జిల్లా కార్యదర్శిగా జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి ఆధ్వర్యంలో నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో బీజేపీ బలోపేతానికి తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కార్యకర్తలు, నాయకులతో కలిసి పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర, ఉపాధ్యక్షుడు రాముయాదవ్, శివరాజ్, బాలకృష్ణారెడ్డి, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల కష్టాలు తీర్చేందుకే గ్యారంటీల అమలు

మర్పల్లి, మార్చి 2: పేదల కష్టాలను తీర్చేందుకే కాంగ్రెస్ గ్యారంటీలను అమలు చేస్తున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం ఆవరణలో శనివారం నాయకులు, కార్యకర్తలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, కలీమోద్దీన్, రామేశ్వర్, సురేశ్, దివాకర్, లక్ష్మారెడ్డి, సర్వేశ్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, శేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.

జడ్పీ చైర్‌పర్సన్‌కు ఆహ్వానం

బషీరాబాద్, మార్చి 2: జీవన్గిలో ఈనెల 7నుంచి 10వ తేదీ వరకు నిర్వహించే శ్రీ మహదేవలింగేశ్వరాలయం జాతరకు రావాలని ఆలయ కమిటీ నిర్వహకులు శనివారం హైదరాబాద్‌లోని నివాసంలో జడ్పీ చైర్‌పర్సన్ పి.సునీతారెడ్డిని కలిసి ఆహ్వానం అందజేశారు. వారితో పాటు ఎమ్మెల్సీ పి.మహేందర్‌రెడ్డిని కూడా కలిసి జాతరకు ఆహ్వానించినట్లు తెలిపారు.

ఆదాయ వనరుల పెంపుతో మౌలిక వసతులు


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర రూరల్, మార్చి 2: ఆదాయ వనరుల పెంపుతో పాటు మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి తెలిపారు. మున్సిపల్ సమావేశ మందిరంలో శనివారం బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ వార్షిక అంచనా బడ్జెట్ రూ.38కోట్లు కేటాయిస్తూ కౌన్సిల్ తీర్మానాన్ని ప్రవేశపెట్టినట్లు వెల్లడించారు. పన్నులు, ఇంటి నిర్మాణ అనుమతులు, వ్యాపార సంస్థల లైసెన్స్ ఫీజులు, పట్టణ ప్రగతి, 15వ ఆర్థికసంఘాల తదితర వనరుల ద్వారా రూ.32.34కోట్లు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ గ్రాంట్స్ ద్వారా రూ.3.05కోట్లు, డిపాజిట్స్ రుణాల ద్వారా రూ.3.06కోట్లు కాగా మొత్తం కలిపి రూ.38.99కోట్లు సమకూరనున్నట్లు తెలిపారు. అదేవిధంగా వేతనాలు రూ.5.75కోట్లు పారిశుధ్య నిర్వహణకు రూ.3.10కోట్లు, పరిపాలనకు రూ.1.33కోట్లు, విద్యుత్ బిల్లులు రూ.1.50కోట్లు, గ్రీన్ బడ్జెట్‌కు రూ.2.70, ఇంజనీరింగ్ నిర్వహణకు రూ.2.94కోట్లు, పట్టణ ప్రణాళికకు రూ.7లక్షలు, బలహీనవర్గాల ప్రాంత అభివృద్ధికి రూ.3.21కోట్లు, ప్రజా సౌకర్యాల కల్పనకు రూ1.69కోట్లు, వార్డుల వారి వ్యయం అభివృద్ధి పనులకు రూ.9.97కోట్లు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ గ్రాంట్స్ ద్వారా రూ.3.05కోట్లు, డిపాసిట్స్, రుణాల ద్వారా 3.06 కోట్లు కాగా మొత్తం 38.91కోట్లు కాగా మిగులు బడ్జెట్ రూ.8లక్షలు కేటాయిస్తూ వార్షిక అంచనా బడ్జెట్ రూపొందించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, కమిషనర్ రాజేంద్రకుమార్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి శివస్వాముల పాదయాత్ర


దోమ: అయినాపూర్ నుంచి శ్రీశైలానికి వెళ్తున్న శివస్వాములు

దోమ, మార్చి 2: మండలంలోని అయినాపూర్ గ్రామానికి చెందిన శివస్వాములు శనివారం ఇరుముడులు కట్టుకొని శ్రీశైలానికి పాదయాత్రగా బయలు దేరారు. మండల, అర్ధమండల దీక్షల్లో ఉన్న శివస్వాములు శివనామస్మరణ చేస్తూ శ్రీశైల క్షేత్రానికి చేరుకుని మొక్కులు చెల్లించుకోనున్నారు. ఈ కార్యక్రమంలో శివస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: మండలంలోని ఇందనూర్ గ్రామానికి చెందిన శివస్వాములు శనివారం శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. అంతకుముందు గ్రామంలోని ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఇరుముడులు ధరించి పాదయాత్రగా శ్రీశైలానికి బయలుదేరివెళ్లారు. గురుస్వామి మోహన్ ఆధ్వర్యంలో శివస్వాములు పాదయాత్రగా వెళ్లారు.

మార్మోగిన శివనామస్మరణ

పెద్దేముల్: మంబాపూర్‌లో శనివారం శివనామస్మరణ మార్మోగింది. శివస్వాములు ఇరుముడులు కట్టుకుని శ్రీశైల క్షేత్రానికి బయల్దేరారు. 45రోజుల దీక్షలో ఉన్న శివస్వాములు శివాలయంలో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. గురుస్వామి వారికి ఇరుముడులు కట్టారు. గ్రామస్తులు, కుటుంబసభ్యులు డప్పు వాయిద్యాల నడుమ వారిని శ్రీశైలానికి సాగనంపారు.


మంబాపూర్ గ్రామం నుంచి ఇరుముడులతో శ్రీశైలానికి బయల్దేరిన శివస్వాములు

తిమ్మాయిపల్లి భూ సమస్యను పరిష్కరించాలి


ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పరిగి/దోమ, మార్చి 2: దోమ మండలంలోని తిమ్మాయిపల్లిలోని సర్వేనంబరు 50/ఏ/1లో గల 1.09 ఎకరాల భూమికి సంబంధించి దోమ మండలానికి చెందిన అయూబ్, పలుప్రజా సంఘాలతో శనివారం జిల్లా ఎస్పీ ఎన్ కోటిరెడ్డి చర్చించారు. ఇట్టి భూమి విషయం సివిల్‌కు సంబంధించిన విషయమని, జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తామని వారికి ఎస్పీ హామీ ఇచ్చారు. ఇట్టి విషయంలో పోలీసుల అధికారులు డబ్బులు తీసుకున్నట్లయితే, నిర్లక్ష్యంగా చేసిన వాటిపై విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని ఎస్పీ వారికి తెలిపారు. తిమ్మాయిపల్లి భూమి విషయంలో తమ డిమాండ్లను ఎస్పీ విని పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎస్పీ హామీ ఇచ్చారని సీపీఎం జిల్లా కమిటి సభ్యుడు వెంకటయ్య విలేకరులతో తెలిపారు. ఎస్పీని కలిసినవారిలో ఆయా సంఘాల నాయకులు ఆర్.వెంకట్‌రాంలు, గోవింద్‌నాయక్, ఆర్.మైపాల్, బి.చంద్రయ్య, శ్రీనివాస్ ఉన్నారు.

'ఆస్పత్రిలో సిబ్బంది కొరత లేదు'

కొడంగల్, మార్చి 2: కొడంగల్ ప్రభుత్వాసుపత్రిలో సిబ్బంది కొరత లేదని ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రప్రియ, జూనియర్ అసిస్టెంట్ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఆస్పత్రికి కొత్తగా 14 మంది స్టాఫ్ నర్సులను నియమించిదని తెలిపారు. దీంతో అత్యవసర సమయాల్లో ఇతర ఆసుపత్రులకు రెఫర్ చేయాల్సిన సమస్య ఇక ఉండదని వెల్లడించారు.

ధారూరులో కంది, వేరుశనగ బీట్లు

ధారూరు, మార్చి 2: వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం సాయంత్రం కంది, వేరుశనగ, మొక్కజొన్న పంట ఉత్పత్తులకు బీట్లు నిర్వహించారు. కందులు క్వింటాలుకు గరిష్ఠంగా రూ.10,350, కనిష్ఠం రూ.10,250, వేరుశనగ క్వింటాలుకు గరిష్ఠంగా రూ.6,875, కనిష్ఠంగా రూ.6550లు, మొక్కజొన్న క్వింటాలుకు 2200 నుంచి 2,280 వరకు ధర పలికిందని మార్కెట్ అధికారులు తెలిపారు.

ఘనంగా ఎంఐఎం ఆవిర్భావ దినోత్సవం


ధారూరులో ఎంఐఎం పార్టీ జెండాను ఎగురవేస్తున్న మోహిజ్ ఖురేషి

ధారూరు, మార్చి 2: ఎంఐఎం పార్టీ 66 వసంతాల వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం ధారూరులో ఆపార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆపార్టీ మండలాధ్యక్షుడు మోహిజ్ ఖురేషి పార్టీ జెండాను ఆవిష్కరించి పండ్లను పంపిణీ చేశారు. కార్యకర్తలు టపాసులు, బాణసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మోహిజ్ ఖురేషి మాట్లాడుతూ ఎంఐఎం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ ప్రజల్లో విశ్వాసాన్ని పొంది పార్టీని విజయబాటలో నడిపిస్తున్నారని అన్నారు. అన్ని వర్గాలప్రజల సంక్షేమం, అభివృద్ధికి ఎంఐఎం పనిచేస్తోందని తెలిపారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి వాహనాల్లో హైదరాబాద్‌లోని దారూసలాంలకు బయలుదేరి వెళ్లారు.

కొడంగల్ రూరల్: ఎంఐఎం పార్టీ 66వ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. శనివారం పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బీ.గుల్షన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తాలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎండీ.ముర్తజా హుసేన్, షేక్ ఆబీద్, సయ్యద్ ముస్తఫా, ఎండీ.అజర్, షేక్ రోమాన్, ఎండీ.సర్తాజ్ హుసేన్, షేక్ అహ్మద్, ఎండీ.అమీర్‌హుసేన్, ఎండీ.షాబాజ్, ఎండీ.జాఫర్‌ఖాన్, ఎండీ.సలీం, ఎండీ.రవూఫ్, రమేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పాలమూర్ ఎంపీ టికెట్‌ను బీసీ అభ్యర్థికి కేటాయించాలి

కొడంగల్, మార్చి 2: పాలమూర్ ఎంపీ టికెట్‌ను బీసీ అభ్యర్థికి కేటాయించాలని బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బీసీసేన ఆధ్వర్యంలో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహులు యాదవ్ మాట్లాడుతూ బీజేపీ పాలమూర్ ఎంపీ టికెట్‌ను బీసీలకు కేటాయించాలన్నారు. జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలకు పార్లమెంట్ టికెట్ కేటాయించి న్యాయం చేయాలన్నారు. ఈ సమావేశంలో బీసీ సంఘం నాయకులు భానుచందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గురుకుల ఫలితాల్లో ఉద్యోగం సాధించిన యువకుడు

కొడంగల్ రూరల్, మార్చి 2: అంగడిరైచూర్‌లో నిరుపేద కుటుంబంలో జన్మించిన బుచ్చి పెంటప్ప, పకీరమ్మ దంపతుల కుమారుడు బుచ్చి కృష్ణ గురుకుల పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబర్చి ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించాడు. పట్టుదల, సహనం, ఓర్పు తన జీవితంలో జరిగిన జరిగిన ఆర్థిక ఇబ్బందులే తన విజయానికి మూలమని బుచ్చికృష్ణ తెలిపారు.

సంక్షిప్తంగా..

● **మేడ్చల్ టౌన్:** గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ సేయింట్ పీటర్స్ కళాశాల ఈసీఈ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ సందిరి శ్వేత రూపొందించిన సోలార్ పద్ధతిలో వాహనాల చార్జింగ్ ప్రాజెక్టును శనివారం ఎంఎస్ఎంఈ సంస్థకు సమర్పించారు. ఎలక్ట్రికల్ వాహనాల వాడకం అత్యధికంగా ఉండటంతో సోలార్ పద్ధతితో వాటిని త్వరగా చార్జింగ్ చేసే విధానం పట్ల ప్రొఫెసర్ శ్వేత ప్రత్యేకంగా అధ్యాయనం చేసి ప్రాజెక్టును తయారుచేశారు. ఎంఎస్ఎంఈ సంస్థ వారు రూ.15లక్షల గ్రాంట్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి, డాక్టర్ ప్రసన్నకుమారి, రవిసుధాకర్ పాల్గొన్నారు.

● **మోమిన్‌పేట్:** టేకులపల్లిలో వెలిసిన శివాలయంలో శనివారం వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు అర్చకులు దిలీప్‌కుమార్ తెలిపారు. ఆలయ నిర్మాణ దాత కాసులబాద్ విజయ్‌కుమార్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● **బషీరాబాద్:** కంసాన్‌పల్లి(బి)లో ఉపాధి హామీ నిధులతో కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డును శనివారం గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ వై.వెంకటేష్ పరిశీలించారు. ఈ రోడ్డు నిర్మాణంతో స్థానిక వార్డు ప్రజలకు అంతర్గత రోడ్డు ఇబ్బందులు తొలగిపోయాయన్నారు.

● **నవాబుపేట:** వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డిని నవాబుపేట మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బందెయ్యగౌడ్ కలిశారు. శనివారం ఆయన మర్యాదపూర్వకంగా శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి భీమ్‌భరత్, ప్రభావతి, ఆనందం, మంజుల పాల్గొన్నారు.

● **కులకచర్ల:** బండవెల్కిచర్ల సమీపంలోని పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామిని శనివారం తన జన్మదినం సందర్భంగా బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్ బూనెటి దర్శించుకున్నారు. ఏకశిల పుణ్యక్షేత్రం అయిన పాంబండ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు.

● **మేడ్చల్‌టౌన్:** పలురంగాల్లో విశిష్ట సేవలందించే వారిని ఎంపిక చేసి జాతీయ స్థాయిలో ఎంఐఆర్‌ఈఆర్ సంస్థవారు అందజేసే అవార్డుకు సీఎంఆర్‌సెట్ ప్రొఫెసర్ వేంకటేశ్వర్లును ఎంపిక చేసి శనివారం అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎంఆర్‌సెట్ కళాశాల వారు వేంకటేశ్వరులును అభినందించారు.

● **కీసర:** వంశపారంపర్యంగా వస్తున్న పట్టా భూమి కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి కీసర గ్రామానికి చెందిన తంగళ్లపల్లి శంకర్ ఆనంద్ కీసర పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశాడు. సర్వే నంబర్ 214లో గల పట్టా భూమిని కోటకొండ అవినాష్, పూంద్రు వినోద్, పూంద్రు మల్లేష్, పూంద్రు శివరాజ్, రాజులు కబ్జా చేస్తున్నారని ఆరోపించాడు. విచారణ జరిపి న్యాయం చేయాలని కోరాడు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ ఫర్ ఉమెన్స్ విద్యార్థులు

మేడ్చల్ టౌన్, మార్చి 2: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ ఫర్ ఉమెన్స్ విద్యార్థులు శనివారం కళాశాల క్యాంపస్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు వైద్యపరీక్షలు చేశారు. రోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనారోగ్యంతో ఉన్న విద్యార్థులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఇన్‌చార్జి బీవీఎస్‌పీ పవన్‌కుమార్, డాక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

25 లక్షల అరటి మొక్కలు ఎండుముఖం

● పరిశ్రమ వ్యర్థాలే కారణంటూ ఆరోపణ ● రూ.కోట్లలో నష్టం


వాడిపోయిన అరటి మొక్కలు

మేడ్చల్ టౌన్ మార్చి 2: అధికారుల నిర్లక్ష్యంతో కోట్ల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లినట్లు రాజబొల్లారం గ్రామ పంచాయతీ పరిధిలోని అగ్రివిట్రోటెక్ లాబరేటరీస్ పరిశ్రమ వారు ఆరోపించారు. ఈ మేరకు పరిశ్రమ యజమాని హరిదాసు ఆదివారం పరిశ్రమలో దెబ్బతిన్న అరటి మొక్కలను మీడియాకు చూపించి మాట్లాడారు. తమ పరిశ్రమలో కొన్నేళ్లుగా అరటి మొక్కలను పెంచుతూ దేశంలోని అన్నిరాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నట్లు తెలిపారు. పక్కనే ఉన్న మెరీనో ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ నుంచి విడుదలవుతున్న వ్యర్థ జలాలతో సుమారు 25 లక్షల అరటి మొక్కలు వాడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో గతంలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా కాలుష్య నివారణ అధికారులు శనివారం మెరీనో ఫుడ్ ప్రొడక్ట్ ప్రయివేటు లిమిటెడ్ పరిశ్రలో తనిఖీలు నిర్వహించి పలు శాంపిళ్లను సేకరించారు. అనంతరం తుది నివేదికను కలెక్టర్‌కు అందజేసి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇంత నష్టం జరుగడానికి స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు సైతం కారణమని హరిదాస్ ఆవేదన వ్యక్తంచేశాడు.

పేకాడుతున్న ఆరుగురిపై కేసు నమోదు

తాండూరురూరల్, మార్చి 2: పేకాటడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు తాండూరు పట్టణ సీఐ సంతోష్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పాత తాండూరులోని అంబేద్కర్ పార్కు సమీపంలో శనివారం పేకాడుతున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు అక్కడికి వెళ్లి చూడగా ఆరుగురు పేకాడుతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారిలో తాండూరుకు చెందిన సమ్మీర్, జియొద్దీన్, ఖాజాపాషా, రాజు, జగ్గప్ప, ఇలియాస్‌లు ఉన్నారు. వారి వద్ద నుంచి రూ.7560ల నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అనుమతులు ఓ చోట.. డంపింగ్ మరో చోట

● ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

తాండూరురూరల్, మార్చి 2: రెవెన్యూ మైన్స్ అధికారుల నుంచి ఒక చోట అనుమతులు పొంది మరోచోట డంపింగ్ చేస్తున్న ఓ ట్రాక్టర్‌ను తాండూరు పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పాత తాండూరుకు చెందిన ఫసల్‌ఖాన్‌కు చెందిన ట్రాక్టర్ పాత తాండూరు కాగ్నా నది నుంచి ఇసుక లోడ్‌తో తాండూరులోని లబ్ధిదారుడు సెహ్రాగంజ్‌లో వేయాల్సి ఉంది. అయితే ట్రాక్టర్‌ను చెనిగేష్‌పూర్ రోడ్డుమార్గంలోని డంప్ చేసేందుకు డ్రైవర్ ప్రకాశం వెళుతున్నాడు. దీంతో ఎస్‌ఐ విఠల్‌రెడ్డి ట్రాక్టర్‌పై నిఘా ఉంచి అనుమతిపత్రాలను పరిశీలించారు. అనుమతులు మరోచోట ఉండటంతో ట్రాక్టర్‌ను సీజ్‌చేసి కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన సమగ్ర వివరాలు సేకరించి తాండూరు తహసీల్దార్‌కు హ్యాండవర్ చేయనున్నట్లు తెలిపారు.

అక్రమంగా డీజిల్ తరలిస్తున్న వాహనం పట్టివేత

తాండూరురూరల్, మార్చి 2: కర్ణాటక నుంచి అక్రమంగా డీజిల్ తరలిస్తున్న బొలేరో వాహనాన్ని పట్టుకున్నట్లు కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని జినుగుర్తి గేటు వద్ద శనివారం కర్ణాటక నుంచి వస్తున్న బొలేరో వాహనాన్ని తనిఖీ చేశారు. వెయ్యి లీటర్ల డీజిల్ ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. డ్రైవర్ బసప్పను అనుమతిపత్రాలు కోరగా ఎలాంటి పత్రాలు చూపించకపోవడంతో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ బసప్పపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రిసార్ట్ యాజమాన్యంపై కేసు నమోదు

పూడూరు, మార్చి 2: మండలంలోని తిరుమలాపూర్‌లో పంచాయతీ అనుమతి లేకుండా కొనసాగిస్తున్న గ్లాంప్ ఇన్‌వల్లి రిసార్ట్ యాజమాన్యంపై కేసు నమోదైంది. కొంతకాలంగా ఈ రిసార్ట్ ప్రభుత్వ అనుమతి లేకుండా కొనసాగిస్తున్నారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి గోవిందు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

అనుమతి లేకుండా నిర్వహిస్తున్న దుకాణం సీజ్

కులకచర్ల, మార్చి 2: మండల కేంద్రంలో అనుమతులు లేకుండా తిరుమల కోకోనట్ ఆయిల్ దుకాణాన్ని టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం సీజ్ చేశారు. అనుమతి లేకుండా ఆయిల్‌ను విక్రయిస్తున్నట్లు వారి దృష్టికి రావడంతో ఆకస్మిక దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ మేరకు దుకాణ యజమాని సిరాజ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అన్వేష్‌రెడ్డి తెలిపారు. అనుమతి లేకుండా నిత్యావసర సరుకులను విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

పాలమూరు ఎత్తిపోతలతో ఎంతో ప్రగతిని సాధించాం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి, మార్చి 2: తెలంగాణ ఏర్పాటయ్యాక 2015లోనే పాలమూరు ఎత్తిపోతలను ప్రారంభించి ఎంతో ప్రగతి సాధించామని పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అన్నారు. పరిగిలోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. 2004 నుంచి 14 వరకు పదేళ్ల పాటు కాంగ్రెస్ ప్రభుత్వం పరిగికి సాగునీరు తీసుకోచ్చేందుకు ఏం చేసిందని ప్రశ్నించారు.న తట్టెడు మట్టి కూడా తీయలేదని విమర్శించారు. కాళేశ్వరం మూడేళ్లలో పూర్తి చేసిన ఘనత కేసీఆర్‌దని తెలిపారు. పాలమూరు ద్వారా 12లక్షల ఎకరాలకు నీరందించే విధంగా బీఆర్ఎస్ ఈ ప్రాజెక్టునున తలపెట్టిందని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు కేసులు వేసి అడ్డుకున్నారని ఆరోపించారు. కేసులను అధిగమించి ఉద్దండాపూర్ వరకు వచ్చిందని, అయితే కేపీ లక్ష్మీదేవిపల్లి నిర్మించాల్సి ఉండగా, అంతలోనే ప్రభుత్వం మారిందన్నారు. ప్రాజెక్టుల విషయంలో కాళేశ్వరం, మెడిగడ్డలో ఉన్న 85 పిల్లర్లలో రెండు పిల్లర్లు కుంగిపోతే కేసీఆర్ ఎలా బాధ్యుడు అవుతాడని ప్రశ్నించారు. పిల్లర్లు కుంగిపోతే విచారణ జరిపించాలని బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఎ.సురేందర్, రైతు మండల మాజీ కో-ఆర్డినేటర్ ఎం.రాజేందర్, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు.బి.ప్రవీణ్‌రెడ్డి, పీఏసీఎస్ వైఎస్ చైర్మన్ ఎస్.భాస్కర్, నాయకులు జగత్‌రెడ్డి, శ్రీనివాస్, దోమ శ్రీశైలం, ఆసిఫ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

శ్రీశైలం బ్రహ్మోత్సవాల్లో అన్న ప్రసాద వితరణ

తాండూరు, మార్చి 2: ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం శ్రీశైలం బ్రహ్మోత్సవాల్లో తాండూరుకు చెందిన సాయిపుత్ర హోం నీడ్స్ అధినేత శంకర్ యాదవ్ ఐదు రోజుల పాటు అన్న 5 రోజుల పాటు అన్న ప్రసాద వితరణ చేపట్టారు. శ్రీశైలం ఎండోమెంట్ ఈవో పెద్దిరాజు వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 70ఏళ్లుగా అన్నదాన కార్యక్రమాన్ని శంకర్‌యాదవ్ నిర్వహిస్తుండగా మిత్ర బృందం తోడ్పాటు అందిస్తున్నారు. ప్రతీరోజు 10వేల మంది శివభక్తులకు అన్నదానం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం కన్వీనర్ రాజ్‌కుమార్, మాజీ ఎంపీపీ రాములు, కౌన్సిలర్ ప్రభాకర్ గౌడ్ పాల్గొన్నారు.

ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చేయూత

దోమ, మార్చి 2: కిష్టాపూర్ ఉన్నత పాఠశాలలో శనివారం శ్రీనిధి ఇంటర్నేషనల్ స్కూల్ అజీజ్‌నగర్ క్లాస్ యంవైపీఐ గల విద్యార్థులు కానిక్ ముత, అద్వైకృష్ణ, విహానా శర్మ, అనేయషా వారి తల్లిదండ్రులతో పాటు డబ్ల్యూహెచ్‌వై ఫౌండేషన్ సభ్యులు ఆర్య, విశ్వేశ్వర్ ప్రోత్సాహంతో కిష్టాపూర్ పాఠశాలకు అల్మారా, 300 లైబ్రరీ పుస్తకాలు, రైటింగ్ స్టేషనరీ, స్నాక్స్, అరటిపండ్లు పంపిణీ చేశారు. వారిని పాఠశాల హెచ్‌ఎం లాల్యానాయక్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.